క్లుప్తంగా

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు



అరిగిపాలెంలో చెరువు గర్భాన్ని మట్టితో కప్పేస్తున్న దృశ్యం

వేపాడ: మండలంలోని అరిగిపాలెం రెవెన్యూలో చెరువును గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుంటున్నారని అదే గ్రామానికి చెందిన ఎస్.రామలక్ష్మి, రైతులు తహసీల్దార్ రాములమ్మకు మంగళవారం ఫిర్యాదు చేశారు. చెరువును మట్టితో కప్పేస్తున్నారని, పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ స్పందించి వెంటనే చెరువును పరిశీలించాలని ఆర్ఐ, వీఆర్ఓలను ఆదేశించారు.

గంజాయి ధ్వంసానికి అనుమతి



ఎస్.కోట ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న డీసీ బాబ్జీరావు, ఏసీ రామచంద్రరావు

శృంగవరపుకోట: పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన గంజాయిని ధ్వంసం చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జీరావు ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావుతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో సీజ్ చేసి ఉన్న 807 కిలోల గంజాయిని పరిశీలించి, ధ్రువీకరించారు. గంజాయిని ధ్వంసం చేసేందుకు ఎస్.కోట సీఐ సీహెచ్.రాజేష్‌కు ఆదేశాలు జారీ చేశారు. నాటుసారా, మద్యం అక్రమ అమ్మకాలు, గంజాయి రవాణా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని సూచించారు.

కరాటేలో పతకాలు



పతకాలు సాధించిన విజేతలతో కోచ్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 25 నుంచి 27 వరకూ నిర్వహించిన హయాషిహా..పోర్టీన్ సైలెంట్ నైట్ కరాటే కప్–2025 పోటీల్లో ఎస్.కోట విద్యార్థులు పతకాలు సాధించారు. ఎస్.కోటకు చెందిన బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్‌డాన్ కోచ్ వి.శ్రీనివాసరావు వద్ద శిక్షణ పొందిన వి.హార్దిక్‌వినయ్, బి.వినయ్‌లు పోటీల్లో సత్తా చాటారు. అండర్–13 గ్రూప్‌లో పోటీ పడిన హార్దిక్‌వినయ్ రజతపతకాన్ని, అండర్–10 గ్రూప్‌లో బి.వినయ్ స్వర్ణపతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఏపీ కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కోండ్రు కీర్తన్, సెక్రటరీ ఉరుకూటి నరేంద్రుడు గ్లాప్రవీణ్‌లు విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీనివాసరావును అభినందించారు.

సకాలంలో రుణం చెల్లించేలా చూడాలి



బ్యాంకు మేనేజర్లను సత్కరిస్తున్న వెలుగు ఏపీఎం భారతి, సిబ్బంది

గుర్ల: డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించేలా చూడాలని వెలుగు ఏపీఎం భారతి వీఓ, వీఓఏలకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓ, వీఓఏలతో పాటు బ్యాంక్ అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. రుణలక్ష్యాలు, చెల్లింపులపై చర్చించారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇబ్బందులు పెట్టకుండా స్త్రీనిధి, పీఎంఈజీపీ రుణాలను అందిస్తున్న మండలంలోని ఎస్‌బీఐ, ఐఓబీ, ఏపీజీవీబీ మేనేజర్లు శ్రీనివాస్, మురళీకృష్ణ, రాంప్రసాద్‌ను వెలుగు సిబ్బంది సత్కరించారు.

తుప్పల తొలగింపు



ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి

వేపాడ: స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) వద్ద తుప్పలు, పేరుకుపోయిన చెత్తను సర్పంచ్ అర్జునమ్మ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. జేసీబీతో కేంద్రం చుట్టూ పరిసరాలను శుభ్రం చేయించారు. పనులను ఈఓపీఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అత్యవసరమైతే... పరుగులు పెట్టాల్సిందే..!

- చీపురుపల్లి ఏరియా ఆస్పత్రిలో సేవలకు దూరంగా రక్తనిధి కేంద్రం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అరబిందో ఫార్మా సంస్థ సహకారంతో నిర్మించిన బ్లడ్ బ్యాంకు భవనం
- గత ప్రభుత్వంలోనే భవనం ప్రారంభం
- ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభం కాని సేవలు
- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోని వైనం



మూసి ఉన్న రక్త నిధి కేంద్రం

చీపురుపల్లి: రోడ్డు ప్రమాదాలు కావచ్చు, ప్రసవ సమయం కావచ్చు, ప్లేట్‌లెట్లు తగ్గి అతి నీరసం అవ్వనివ్వండి....ఇలా ఏదైనా కానివ్వండి, అత్యవసరంగా కావాల్సింది రక్తమే. ఆసమయంలో రక్తం లభించకపోతే ప్రాణాలు గాల్లో కలిసిపో వాల్సిందే. అలాంటి పరిస్థితుల నుంచి నియోజకవర్గ ప్రజలను తప్పించేందుకు గత ప్రభుత్వంలో చీపురుపల్లి ప్రాంతీ య ఆస్పత్రిలో రక్త నిధి కేంద్రం ఏర్పాటు చేశారు. ఎంతో ఉన్నత ఆశయంతో వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజాప్రతినిధు లు అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి సీఎస్ఆర్‌లో భాగంగా ఏర్పాటు చేయించిన రక్తనిధి కేంద్రం ప్రస్తు తం తలుపులు మూసుకుని దర్శనమిస్తుండడం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. ఏరియా ఆస్పత్రిలోని స్టాక్ పాయింట్‌లో పరిమితంగానే రక్తం లభిస్తోంది. రక్తం కొరత కారణంగా జిల్లాకేంద్రం, ఇతర ప్రాంతాలకు పరుగులు పెట్టాల్సి వస్తోందని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రోగులతో రద్దీగా ఏరియా ఆస్పత్రి

నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలో 2023 వరకు యాభై పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ఉండేది. తర్వాత దీన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంద పడకల ప్రాంతీయ ఆస్పత్రిగా స్థాయి పెంచింది. దీంతో ఇక్కడ రోజుకు కనీసం 300కు పైగా ఓపీ నమోదవుతుండగా వంద వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. నెలకు కనీసం వందకుపైగా ప్రసవాలు జరుగుతుండేవి. మరో వైపు చీపురుపల్లి పరిసర ప్రాంతాల్లోని నాలుగైదు మండలాల నుంచి రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగ్రాతుల తాకిడి కూడా అధికంగానే ఉంటుంది. దీంతో అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమయ్యేది. అప్పటి సీహెచ్‌సీలో తాత్కాలికంగా ఉండే బ్లడ్ బ్యాంక్‌లో ఉన్న అరకొర ప్యాకెట్లతోనే వైద్యులు కాలం వెళ్లదీసేవారు.

రూ.70 లక్షలతో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు

చీపురుపల్లి ఏరియా ఆస్పత్రిని ఆశ్రయించే రోగుల్లో అవసరమైన వారికి రక్తం అందుబాటులో ఉండాలంటే బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని అప్పటి ఎమ్మెల్యే, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆలోచన చేశారు. అరబిందో ఫార్మా కంపెనీతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులతో బ్లడ్ బ్యాంకు నిర్మించాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలోనే అరబిందో ఫార్మా కంపెనీ రూ.70 లక్షలతో బ్లడ్ బ్యాంకు కోసం భవనం నిర్మించి, అవసరమైన సదుపాయాలు కల్పించింది. 2024 మార్చి 5న ఈ బ్లడ్ బ్యాంకును బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. అంతే కాకుండా బ్లడ్ బ్యాంకు కార్యకలాపాల బాధ్యతను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించారు. ఇంతలోనే ఎన్నికలు రావడంతో అప్పట్లో కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ బ్లడ్ బ్యాంకు సేవలు ప్రారంభం కాలేదు. కూటమి పాలకులు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల కిత్రమే ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హాజరై ఆస్పత్రి అభివృద్ధి, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. అయితే ఆ సమావేశంలో బ్లడ్ బ్యాంకు అంశంపై చర్చించకపోవడం గమనార్హం. అన్ని వనరులూ ఉండి కూడా మాకు ఏంటీ దుస్థితి అని చర్చ క్షేత్రస్థాయిలో ప్రజల్లో జరుగుతోంది.

గిరిజనులకు నిత్యావసర సరుకుల పంపిణీ



ఎస్.కోట మేజర్ పంచాయతీ పరిధి రేగపుణ్యగిరి గ్రామంలోని 20 గిరిజన కుటుంబాలకు ఎస్.కోట పట్టణానికి చెందిన కెజియా ఫౌండేషన్ సభ్యులు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశా రు. సంస్థ తరఫున ప్రతి నెలా చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల గిరిజనులకు సహాయం అందించామని కెజియా ఫౌండేషన్ సభ్యులు జోసెఫ్ ప్రసాదరావు, బి.సైమన్, కేశవ, రోజీ, పోపీ తెలిపారు. – శృంగవరపుకోట

పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయ విధానంలో పండ్ల మొక్కల పెంపకంపై బొద్దాం సుస్థిర వ్యవసాయ సేవా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ ఆర్‌టీఎల్ ప్రకాష్ మంగళవారం అవగాహన కల్పించారు. మొక్క ల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు వాడాల్సిన కషాయాలు, జీవామృతాల గురించి వివరించారు. మొక్కల ఎంపిక, నాటే విధానం, కొమ్మల కత్తిరింపుల గురించి హార్టికల్చరల్ ఏఈఓ అప్పారావు, నవధాన్యాల సాగు, అంతర పంటల గురించి సుస్థిర వ్యవసాయం కేంద్రం కో–ఆర్డినేటర్ వెంకటరావు అన్నారు. – వేపాడ

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గజపతినగరం రూరల్: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ఏఓ ధనలక్ష్మి చెప్పారు. నవధాన్యాలు సాగు చేసే విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, అలాగే పండ్ల మొక్కల పెంపకంపై లింగాలవలస గ్రామ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వల్ల నేలలో స్థూల,సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయని చెప్పారు. పండ్ల తోటల్లో అంతర పంటలను సాగు చేయడం ద్వారా, పొలాల గట్లపై కూరగాయిల సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం అధికారి గోవిందమ్మ, వీఏఏలు ప్రమీల, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందించాలని వినతి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకుడు అప్పలరాజు, తదితరులు

లక్కవరపుకోట: హుద్ హుద్ తుపాన్ బాధితులకు ఇళ్ల పట్టాలు అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డేగల అప్పలరాజు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని కోరారు. ఎమ్మెల్యేను మండల కేంద్రంలోని ఆమె నివాసంలో బాధితులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జామి మండలంలోని అలమండ గ్రామంలో హుద్ హుద్ తుపాన్ బాధితుల కోసం 2018లో 160 ఇళ్లను నిర్మించారన్నారు. 2022 సంవత్సరంలో 135 మంది లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఆ ఇళ్లను కేటాయించి ,పట్టాలను అందజేశారని గుర్తు చేశారు. అయితే ఆసమయంలో లాటరీకి హాజరు కానివారు, లబ్ధిదారుల్లో చనిపోయిన వారి వారసులకు మొత్తం 25 మందికి ఇళ్లు కేటాయించలేదని చెప్పారు.అప్పటిలో ఇళ్ల పట్టాలు అందుకోని వారికి తక్షణమే ఇళ్ల పట్టాలను అందజేసి ఇళ్లు కేటాయించాలని కోరారు. అలాగే హుద్ హుద్ ఇళ్ల కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేవని వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు.ఎమ్మెల్యే స్పందిస్తూ ఇళ్ల పట్టాలు,ఇళ్ల కేటాయింపుల విషయమై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



పూర్ణకలశం, ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలసలో మూడురోజుల పాటు నిర్వహించనున్న దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు రవి ఆధ్వర్యంలో పెద్దలు, గ్రామస్తులతో ఉదయం పూజలు చేయించారు. సాయంత్రం పూర్ణకలశం, ఘటాల ఊరేగింపు చేశారు. బుధవారం ప్రత్యేక పూజలు, గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న గిరిజనుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

వేపాడ: హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం తమ గ్రామాన్ని అదానీకి అప్పగించవద్దంటూ మండలంలోని గిరిశిఖర మారిక గ్రామస్తులు రెండో రోజు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగించారు. గిరిజనులను తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు శాంతియుతంగా, ఎవరికీ ఇబ్బంది పెట్టకుండా గిరిజనులు ఆందోళన చేయడం తప్పా అని పోలీసులను ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి రాకుండా పోలీసులు అడ్డుగా తాళ్లు కట్టడం సమంజసం కాదన్నారు. ఆందోళనకారులతో సీఐ అప్పలనాయుడు మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. అనంతరం తహసీల్దార్ రాములమ్మతో సీఐ అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ చర్చించారు. ఆందోళనల్లో భాగంగా గిరిజనులు అక్కడే వంటావార్పు చేసి భోజనాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్ది రమణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు



సర్పంచ్, గ్రామపెద్దలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ తులసీనాథ్

బొండపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ,సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.తులసీనాథ్ సూచించారు.జి.పి.అగ్రహారం గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో మురుగు కాలువలతో పాటు, కాలువలు లేని వీధులను పరిశీలించారు.కాలువలు లేని వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి సర్పంచ్ సిరిపురపు పూర్ణిమకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం ప్రారంభంలోగా కాలువల నిర్మాణా నికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఆయన వెంట ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు తదితరులు ఉన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై దృష్టి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

గంట్యాడ: కిశోర బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతుల నిర్వహణతో పాటు వారు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల్లో వచ్చే మార్పుల గురించి వారికి తెలియజేయాలని చెప్పారు. రక్తహీనత బారిన పడకుండా విధిగా పౌష్టికాహారం తీసుకోవాలనే విషయంపై కిశోరబాలికలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో 11 నుంచి 14 ఏళ్ల బాలికలను ఒక గ్రూపు, 15 నుంచి 18 సంవత్సరాల వారిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేయాలని చెప్పారు.ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు పెద్ద సంఖ్యలో జరగాలి



రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

విజయనగరం గంటస్తంభం/విజయనగరం టౌన్: : జిల్లాలో రక్తదాన శిబిరాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున జరగాల్సిన అవసరం ఉందని జిల్లా పౌరువేదిక అధ్యక్షుడు భీశెట్టి, చిన్న సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మాతృభూమి సేవాసంఘం, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో తేలుగుంటి సురేష్ పుట్టినరోజు సందర్భంగా యూత్ హాస్టల్లో జరిగిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ..జిల్లాలో ప్రస్తుతం రక్తం అందక చాలామంది రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కొంతమంది డాక్టర్లు రోగులను విశాఖపట్నం పంపేస్తున్నారని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వంలోని అధికారులు రక్తదానంపై విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. ఘోషాఆస్పత్రిలో రక్తం అవసరంపై అధికారులు ఆలోచన చేయాలని కోరారు. చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర మాట్లాడుతూ యువజన మహిళా సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ప్రముఖుల జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎంఆర్‌పీఎస్ నాయకులు సుధాకర్, శ్రీనివాస్, అంజిబాబు, సంతోష్ పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం

విజయనగరం గంటస్తంభం: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని, చికాగోలో కార్మికలోకం రక్తతర్పణం చేసి కేవలం తమ దేశపు కార్మికవర్గానికే కాకుండా ప్రపంచ కార్మిక లోకానికికంతటికీ కొత్త వెలుగును అందించిన రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడేను కార్మికలోకం అంతఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వీటీ అగ్రహారం దగ్గర గల ఫ్లోర్ మిల్లు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ప్రచార వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ..రోజుకు 24 గంటల్లో 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, మిగిలిన 8 గంటలు రిక్రియేషన్ కోసం కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సమితి నాయకుడు బూర వాసు, కార్మికులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామ సమీపంలోని దుర్గమ్మ ఆలయం వెనుక తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు.పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఎస్ఐ నీవన్‌పడాల్ తన పోలీస్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,430 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వాహన తనిఖీలు

బొండపల్లి: మండల పరిధిలోని జాతీయ రహదారి –26లో పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్ఐ యు. మహేష్ మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలను, వాహన చోదకుల లైసెన్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన పత్రాలతో పాటు లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనచోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

7న మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మే 7వ తేదీన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

సరుగుడు తోట దగ్ధం



సరుగుడు తోటలో వ్యాపించిన మంటలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కోనూరు రెవెన్యూ పరిధిలో సోమవారం రాత్రి ఎనిమిది ఎకరాల సరుగుడు తోట దగ్ధమైందని అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పూసపాటిరేగ మండలం వెల్దూరు గ్రామానికి చెందిన బాధిత రైతు కాలపురెడ్డి ఆదినారాయణ గరివిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కోనూరు గ్రామానికి చెందిన రైతు నుంచి 8ఎకరాల భూమిని శిస్తుకు తీసుకుని ఆ భూమిలో బోరు,పైపులైన్ వేసి సరుగుడు తోటను సాగు చేశానని పేర్కొన్నాడు. ఈ సరుగుడు తోటకు సమీపంలో గ్రామానికి చెందిన మరోరైతు బోరు వేసి వ్యవసాయం చేస్తున్నాడని, కొన్ని నెలలుగా పాడైపోయి ఉన్న విద్యుత్ తీగల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా దొంగతనంగా విద్యుత్‌ను తీసుకునే క్రమంలో పెద్దఎత్తున మంటలు వ్యాపించి తన సరుగుడు తోట దగ్ధమైందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ప్రమాదంలో రూ.50 లక్షల విలువైన సరుగుడు తోటతో పాటు రూ.3లక్షల విలువైన పైప్‌లైన్, కేబుల్ వైర్లు ధ్వంసమై నష్టపోయాయని వాపోయాడు. ఈ విషయమై సంబంధిత శాఖాధికారులను ప్రశ్నించగా తమకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకున్నారని వాపోయాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని ఫిర్యాదులో అభ్యర్థించాడు.